

మేడారంలో రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న సత్యవతిరాథోడ్, రెడ్‌కో చైర్మన్, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

## మహాజాతరను వైభవంగా నిర్వహించాలి

### 21 శాఖల అధికారులతో సమీక్షలో మంత్రి సత్యవతిరాథోడ్

తాడ్వాయి, జూలై 3 : వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క – సారలమ్మ మహాజాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహాజాతరలో భక్తులకు సౌకర్యాలు కల్పించే 21 శాఖల అధికారులతో స్థానిక ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో సోమవారం రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, ములుగు జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, కలెక్టర్ కృష్ణఆదిత్య, ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్ మొదటి సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాజాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు తయారు చేసిన ప్రణాళికల వివరాలను మంత్రికి వివరించారు. గత జాతర కంటే మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని, మేడారం సమ్మక్క, సారలమ్మ అనుబంధ ఆలయాల అభివృద్ధికి కూడా నివేదికలు తయారు చేశారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత జాతర కంటే వైభవంగా నిర్వహించాలని, అధికారులందరు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతరకు విడుదల చేసే నిధుల్లో ఎక్కువగా శాశ్వత నిర్మాణాలకు కేటాయించేలా ప్రణాళికలు తయారుచేయాలని, జాతర సమయంలోనే కాకుండా మిగతా సమయాల్లో తల్లుల దర్శనానికి వచ్చే భక్తులు ఉపయోగపడాలని సూచించారు. కమ్యూనిటీ కిచెన్ షెడ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. గత జాతరలాగే నిధులను కేటాయిస్తామని తెలిపారు. రూ.1కోటీ 4లక్షలతో నిర్మించిన రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వెళ్లారు. దేవాదాయశాఖ అధికారులు, పూజారులు మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులకు డోలివాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. వారు అమ్మవార్లకు గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలని తల్లులను కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని తల్లులను వేడుకున్నట్లు చెప్పారు.

## *గంటల వ్యవధిలో అన్నదమ్ములు మృతి*

### నగరంలో ఘటన.. ఇరు కుటుంబాల్లో విషాదం



కొమురయ్య, సదానందం (ఫైల్)

పోచమ్మమైదాన్, జూలై 3: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొన్ని గంటల వ్యవధిలో అన్నదమ్ములు అనారోగ్యంతో మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన ఉమ్మగాని కొమురయ్య, ఉమ్మగాని సదానందం అన్నదమ్ములు. కొమురయ్య రంగశాయిపేటలోని గణేశ్‌నగర్, సదానందం ఎల్‌బీ నగర్ తిలక్‌రోడ్డులో నివసిస్తున్నారు. సదానందం ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు చేశాడు. కొమురయ్య తన కొడుకు పెళ్లి చేసి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేసి, రిటైర్డ్ అయి ఇంటి వద్ద ఉంటున్నాడు. సదానందం గీతకార్మిక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అన్నదమ్ములు ఇద్దరూ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో రంగశాయిపేట గణేశ్‌నగర్‌లో కొమురయ్య ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశాడు. తిలక్‌రోడ్డులో నివసిస్తున్న సదానందం ఆరోగ్యం క్షీణించగా ఎంజీఎం దవాఖానకు తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కాగా, అన్నదమ్ములు గంటల వ్యవధిలో మృతిచెందటంతో కుటుంబాల్లో విషాదం నెలకొంది. సదానందం కుటుంబ సభ్యులను స్థానిక కార్పొరేటర్ ఎండీ ఫుర్ఖాన్, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, మాజీ కౌన్సిలర్ దూపం సంపత్, డాక్టర్ పోలా నటరాజ్, అనిల్‌కుమార్, ముస్కె ప్రమీల, దుబాసి సమ్మక్క పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు.

## శిశువు విక్రయంపై కొనసాగిన విచారణ

నెక్కొండ, జూలై 3: నెక్కొండ తండాలో నవజాత శిశువు విక్రయంపై చైల్డ్‌లైన్ చైర్‌పర్సన్ వసుధ సోమవారం విచారణ జరిపారు. శిశువు తల్లిదండ్రులు బోడ స్వామి, అనూషను విచారించారు. ఇప్పటికే ఒక అబ్బాయి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, నాలుగో సంతానం ఆడపిల్ల కావడంతో పోషించుకోలేక దవాఖానలోనే మరొకరికి శిశువును అప్పగించినట్లు వారు తెలిపారు. శిశువు ఆచూకీపై సరైన సమాచారం వారికి అందలేదు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి నుంచి నవజాత శిశువు మాయమైన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రసూతికి వెళ్లిన బాలింత శిశువు లేకుండానే ఈనెల 28న తండాకు చేరుకుంది.

# తెలంగాణ బాహుబలి సీఎం కేసీఆర్

- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష
- తెలంగాణ ఇవ్వడం కాదు.. గుంజుకున్నాం
- మోసపూరితంగా రాహుల్‌గాంధీ హామీలు
- పింఛన్ కర్ణాటకలో రూ.800 ఇస్తూ.. తెలంగాణలో రూ.4వేల ఇస్తరా?
- చిత్తశుద్ధి లేని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు
- విలేకరుల సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రకటన చేయాలి
- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జూలై 3: తెలంగాణ రాజకీయాల్లో బాహుబలి సీఎం కేసీఆర్, రాష్ట్రంలో నంబర్ వన్ పార్టీ బీఆర్‌ఎస్ అని మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనగర్జన సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు తెలంగాణ ప్రజలను అవమానపరిచేలా, మోసం చేసేలా ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి భయపడి పారిపోయిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ప్రధాని కావాలని కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. జాతీయస్థాయి నాయకుడికి కనీస అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. జాతీయ పార్టీలకు దేశమంతా ఒకే విధానం ఉండాలని హితవు పలికారు. ప్రపంచంలోని మేధావులు అబ్బురపరిచే కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చర్చించుకుంటుంటే లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.80వేల కోట్లు ఖర్చయితే రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందనడం అవగాహన రాహిత్యమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయగా ఫలితాలను ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క రాసిచ్చిన స్క్రిప్టు మాత్రమే రాహుల్‌గాంధీ చదివాడని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే చేయూత ద్వారా పింఛన్ రూ.4వేలు చేస్తామనడం సంతోషంగా ఉందన్న కడియం ఇటీవల కర్నాటకలో గెలిచి ఎంతిస్తున్నారని ప్రశ్నించారు. అక్కడ రూ.800 ఇస్తూ తెలంగాణలో రూ.4వేలు ఇస్తామనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పెన్షన్ ప్రకటన ఎన్నికల కోసం చేసిందేనని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రీరామ రక్ష అన్నారు.

### పోరాటాల ఫలితంగానే తెలంగాణ

కేసీఆర్ నాయకత్వంలో మలిదశ పోరాటాలు, అనేక మంది బలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలేదని, గుంజుకున్నామని కడియం చెప్పారు. అవినీతికి పేటెంట్ కాంగ్రెస్ పార్టీయేనని, కాంగ్రెస్ పార్టీలోని ముఖ్య నాయకులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, దేశానికి స్కాంలను పరిచయం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు.

### బీజేపీకి సింగిల్ డిజిట్

బీజేపీ గ్రాఫ్ జీరోకు పడిపోయిందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని కడియం అన్నారు. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండాలని కోరుకుంటున్నానని.. ఆయన భాష, వ్యవహార శైలిపై ప్రజలతోపాటు బీజేపీ నాయకులు సైతం అసహ్యించుకుంటున్నారని, ఆయన బీజేపీ అధ్యక్షుడిగా ఉంటే బీఆర్‌ఎస్‌కే లాభమని కడియం పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని చూస్తుంటే జాలేస్తోందని, గిరిజన యూనివర్సిటీ గురించి అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ములుగులో భూమి కేటాయించగా కేంద్రం ప్రభుత్వం కూడా ఆమోదించిందని, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేసి వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తప్పులన్నీ బీజేపీ వద్ద పెట్టుకొని మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణపై వివక్ష చూపుతున్న కేంద్రం అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. కర్నాటకలో అప్పర్ బదా ప్రాజెక్టుకు, మధ్యప్రదేశ్‌లో కెన్‌బెటావా ప్రాజెక్టు, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చి కాళేశ్వరానికి ఇవ్వకపోవడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌కు ఈ వివక్ష కనిపించడం లేదా అని కడియం మండిపడ్డారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలోనూ కేంద్రం వైఖరి తెలుపడం లేదన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక ఏళ్లుగా ఉద్యమాలు జరగ్గా విభజన చట్టంలో పొందుపరిచారని, ఇప్పుడు అది కాకుండా వ్యాగన్ మాన్యుఫాక్చరింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, 8న ప్రధాని మోదీ ప్రారంభిస్తారంటున్న బీజేపీ నేతలు డీపీఆర్, కేబినెట్ ఆమోదం లేకుండా ఏలా ఏర్పాటు చేస్తారో చెప్పాలన్నారు. ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణకు ఎన్ని నిధులిచ్చారు? గుజరాత్‌కు ఇచ్చిన నిధులపై వరంగల్‌లో బహిరంగ చర్చకు కిషన్‌రెడ్డి సిద్ధమా? అని కడియం సవాల్ విసిరారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన బీజేపీకి తెలంగాణలో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, వరంగల్‌లో సభ పెట్టే అర్హత లేదన్నారు. బహిరంగ సభల పేరుతో కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఎన్నికలు వస్తున్నందున మభ్యపెట్టేందుకు రెండు పార్టీలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలంగాణకు శ్రీరామ రక్ష సీఎం కేసీఆర్ అని అన్నారు.

## సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్న దేశ ప్రజలు

### చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలపడంతో దేశ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. దేశవ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణకు భయపడుతున్నారని తెలిపారు. ఖమ్మం కాంగ్రెస్ సభను చూసి ప్రజలు నవ్వుకుంటున్నా రని, అమలు కానీ హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు నమ్మరన్నారు. పోడు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. తొమ్మిదేళ్లుగా ఒక్క హామీ నెరవేర్చకుండా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీజేపీ డ్రామాలు ఆడుతోందన్నారు. వరంగల్ ప్రజల చిరకాల వాంఛ కోచ్ ఫ్యాక్టరీ విషయంలో గతంలో కాంగ్రెస్ దగా చేస్తే ఇప్పుడు బీజేపీ మోసం చేసిందన్నారు. కాజీపేటలో ఏర్పాటు చేసే వ్యాగన్ తయారీ యూనిట్‌పై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతుండగా, వ్యాగన్ పరిశ్రమ ఎన్నికల స్టంట్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీ సాధించే వరకూ పోరాటం ఆగదన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని చీఫ్ విప్ అన్నారు.

# పెత్తందార్ల సింహస్వప్నం

- తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య
- నేడు కడవెండిలో ఆయన వర్ధంతి
- అధికారికంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

దేవరుప్పుల, జూలై 3 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అమరత్వం పొంది 77 ఏండ్లయ్యింది. పేదవర్గాలు, రైతులపై వివక్ష కొనసాగిన ఆ రోజుల్లో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం గ్రామాల్లో పోరాటాలకు తెరలేవగా, వేలాది మంది సంఘాలుగా ఏర్పడి దండుకట్టిన రోజులవి. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమాలు ఉవ్వెత్తున లేవగా కొందరి చేతుల్లో ఉన్న వేలాది ఎకరాల భూమిని వారి నుంచి విముక్తి చేసి పేదలకు పంచిన చరిత్ర ఈ ఉద్యమానికి ఉంది. వెట్టిచాకిరి నుంచి సామాన్యులకు విముక్తి కలిగించిన ఉద్యమది. ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పోరాటాన్ని పలు దేశాల్లో వివక్షకు గురైన ఉద్యమకారులు ఆదర్శంగా తీసుకుని విజయాలు సాధించిన ఘనత ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో కడవెండి గడ్డ నుంచి ఉద్భవించిన వీరుడే దొడ్డి కొమురయ్య. తుపాకి తూటాలకు ఎదురొడ్డి



కడవెండిలో ఆవిష్కరించనున్న దొడ్డి కొమురయ్య విగ్రహం

వీరమరణం పొంది నేటికి 77 ఏండ్లు. ఆయన పోరాట పటిమను పుస్తకంలో ముద్రించగా నేటికీ రష్యా సెంట్రల్ లైబ్రరీలో అందుబాటులో ఉండడం విశేషం.

### అధికారికంగా వర్ధంతి

దొడ్డి కొమురయ్య సాహసాన్ని, ఆయన అమరత్వం తర్వాత ఉద్యమ తీవ్రత, విజయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నది. ఇప్పటికే జయంతిని అధికారికంగా నిర్వహించగా, ప్రథమంగా వర్ధంతిని మంగళవారం తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. కడవెండితోపాటు, హైదరాబాద్ రవీంద్రభారతిలో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించనున్నారు.

### స్వస్థలం కడవెండిలో..

దొడ్డి కొమురయ్య స్వస్థలం కడవెండిలో ఇన్నాళ్లు ఆయన స్మారక స్థూపం ఉండగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి పనుల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సౌజన్యంతో గ్రామపంచాయతీ పక్కన విగ్రహం ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి దొడ్డి కొమురయ్య స్మారక కమిటీ సారథ్యం వహిస్తుండగా ఆయన వారసులు దొడ్డి చంద్రం, మల్లేశ్ పర్యవేక్షిస్తున్నారు. విగ్రహదాత ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, మంత్రి ఎర్రబెల్లి సతీమణి ఉషాదయాకర్‌రావు, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, అరుణోదయ విమలక్క వస్తున్నట్లు దొడ్డి చంద్రం తెలిపారు.